
సాక్షి భద్రాద్రి కొత్తగూడెం

బుధవారం । 5 । మార్చి । 2025



..పుట్టింటికి ఆపద రావొద్దు

బొగ్గుకు పుట్టినిల్లయిన ఇల్లెందుకు ఆపద రాకుండా చూడాలని సింగరేణి అధికారులకు ఎమ్మెల్యే కనకయ్య సూచించారు. 8లో





వాతావరణం

జిల్లాలో బుధవారం ఉష్ణోగ్రత అధికంగానే నమోదవుతుంది. తెల్లవారుజామున, రాత్రి వేళల్లో మాత్రం కొంత చలి ప్రభావం ఉంటుంది.

న్యూస్‌రీల్

నేత్రపర్వం.. రామయ్య నిత్యకల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం : భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక మంగళవారం నేత్రపర్వంగా సాగింది. తెల్లవారు జామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం జరిపించారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. మంగళవారాన్ని పురస్కరించుకుని అభయాంజనేయస్వామి వారికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు.

కృషి, పట్టుదల ఉంటే విజయం సాధ్యం

నిట్ ప్రొఫెసర్ లక్ష్మారెడ్డి



మాట్లాడుతున్న లక్ష్మారెడ్డి

పాల్వంచరూరల్ : కృషి, పట్టుదల, అంకుఠిత దీక్ష ఉంటే ఏ రంగంలోనైనా విజయం సాధించొచ్చని వరంగల్ నిట్ ప్రొఫెసర్ కె.లక్ష్మారెడ్డి అన్నారు. లక్ష్మీదేవిపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం తెలంగాణ అకాడమీ సైన్సెస్, జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన సెమినార్‌లో ఆయన మాట్లాడారు. కొందరు సామాన్య కుటుంబాల నుంచి వచ్చినా ఉన్నతంగా నిలుస్తారని, వారిలో ఉంటే పట్టుదలే దానికి కారణమని అన్నారు. ప్రిన్సిపాల్ పద్మ మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక యుగంలోనూ కొందరు మూఢ నమ్మకాలతో జీవిస్తున్నారని, అలాంటి వారికి విద్యార్థులు అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జేవీవీ ఉపాధ్యక్షుడు ఆర్.వెంకటేశ్వరరావు, లెక్చరర్ రాజ్యలక్ష్మి, కేజీబీవీ వైస్ ప్రిన్సిపాల్ జె.మాధవి, విజయప్రసాద్, అరుణకుమారి, డి.రమేష్, కొండల్‌రావు, స్వరూపారాణి, పి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

‘నవమి’ టెండర్లకు రంగం సిద్ధం





స్టేడియంలో తలంబ్రాలు కలుపుతున్న భక్తులు (ఫైల్) (ఇన్‌సెట్) పసుపు కుంకుమలను దంచి పెళ్లి పనులను ప్రారంభించిన ఈఓ, మహిళలు (ఫైల్)

ఒకటి, రెండు రోజుల్లో ఆహ్వానం

- రూ.2.50 కోట్లతో చేపట్టనున్న పనులు
- ఈనెల 14న రామయ్య పెళ్లి పనులు మరూ
- 30 నుంచి బ్రహ్మోత్సవాలకు శ్రీకారం
- ఏప్రిల్ 6న శ్రీరామ నవమి, 7న పట్టాభిషేకం

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి దేవస్థానంలో అంగరంగ వైభవోపేతంగా జరిగే శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలకు హడావిడి ప్రారంభమైంది. ఏప్రిల్ 6న శ్రీరామనవమి, 7వ తేదీన పట్టాభిషేక మహోత్సవాలు జరగనుండగా, ఈ బ్రహ్మోత్సవాలను సుమారు 2.50 కోట్ల వ్యయంతో పనులు చేపట్టేందుకు ఆలయ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

త్వరలోనే టెండర్లు..

ప్రతి ఏడాది శ్రీరామనవమి ఉత్సవాలకు ఫిబ్రవరి నెలాఖరు వరకే టెండర్లు ఖరారు కావడంతో పాటు పనులు ప్రారంభమయ్యేవి. అయితే ఈ ఏడాది ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లో ఉండడంతో టెండర్లు ఖరారు చేయకున్నా.. యాక్షన్ ప్లాన్ మాత్రం సిద్ధం చేశారు. ఒకటి, రెండు రోజుల్లో పనుల వ్యయాన్ని ప్రకటించి టెండర్లు పిలిచేలా ప్రణాళిక రూపొందించారు. కాగా నవమి బ్రహ్మోత్సవాలకు కేటాయించిన రూ.2.50 కోట్లలో రూ.1.50 కోట్ల వరకు భక్తులకు ఏర్పాటు చేసే వసతులు, రామాలయం, పర్ణశాల ఆలయానికి రంగులు, విద్యుత్ దీపాలంకరణ, మిథిలా స్టేడియంలో బారికేడ్లు, కూలర్లు, తాత్కాలిక వసతి ఇతరత్రా పనులకు వెచ్చించనున్నారు. మరో రూ.కోటితో స్వామి వారికి తలంబ్రాలు, పట్టువస్త్రాలు, పూల అలంకరణ, క్రతువుకు సంబంధించి వ్యయం చేయనున్నారు. ఒకటి, రెండు రోజుల్లో టెండర్లను ఆహ్వానిస్తే ఈ పనులకు లైన్ క్లియర్ అవుతుంది. ఇక కలెక్టర్ ఆధ్వర్యంలో సమీక్ష సమావేశాలు నిర్వహించి సామాన్య భక్తులకు అందాల్సిన వసతులు, కల్యాణ వీక్షణంపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సి ఉంది.

హోలీ నుంచి పెళ్లి పనులు..

ఈనెల 14న హోలీ పండుగ రోజున రామాలయంలో స్వామివారి పెళ్లి పనులు ప్రారంభించనున్నారు. ప్రతి ఏడాది ఫాల్గుణ పౌర్ణమి రోజున పసుపు కొమ్ములు దంచి తలంబ్రాల తయారీతో పెళ్లి పనులకు శ్రీకారం చుట్టడం ఆనవాయితీ. మిథిలా స్టేడియం ఎదురుగా ఉన్న వైకుంఠ ద్వారం వద్ద ఈ వేడుకలను గత రెండు సంవత్సరాలుగా జరుపుతున్నారు. భద్రాచలంలో మాత్రమే ప్రత్యేకమైన తలంబ్రాల తయారీ ఎంతో విశిష్టమైనది. భక్తులు సమర్పించిన బియ్యంలో పసుపు, రోజ్‌వాటర్, గులామ్, సుగంధద్రవ్యాలు, అత్తర్ కలిపి తలంబ్రాలు తయారు చేస్తారు. నిజాం నవాబుల నాటి సంప్రదాయాన్ని ఇప్పటికీ భద్రాచలం రామాలయంలో కొనసాగిస్తున్నారు. ఇదే రోజున స్వామి వారికి వసంతోత్సవం నిర్వహించనున్నారు. కాగా ప్రతి ఏడాది భక్తుల నుంచి పెరుగుతున్న ఆదరణను దృష్టిలో పెట్టుకుని ముత్యాల తలంబ్రాలను సైతం ఈ ఏడాది పెంచనున్నారు. ఆలయ విక్రయశాలతో పాటు పోస్టాఫీస్‌లో, ఆర్టీసీ కార్గో ద్వారా విక్రయించనున్నారు. అదేవిధంగా ఈనెల 30వ తేదీ ఉగాది పండుగ రోజున బ్రహ్మోత్సవాలకు శ్రీకారం చుట్టనున్నారు. 30 నుంచి ఏప్రిల్ 5వ తేదీ వరకు శాస్త్రోక్త కార్యక్రమాలు, 6వ తేదీన శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవం, 7వ తేదీన పట్టాభిషేకం జరగనున్నాయి.

ఫాల్గుణ మాసంలో ప్రత్యేక పూజలు..

ఫాల్గుణ మాసం సందర్భంగా శ్రీ సీతారామ చంద్రస్వామి వారి ఆలయంలో ప్రత్యేక పూజలు జరపనున్నారు. ఈనెల 10వ తేదీన పుష్యమి నక్షత్రం సందర్భంగా పట్టాభిషేకం, 13న వసంతోత్సవం, డోలోత్సవాలకు అంకురార్పణ, 14న పసుపు, కుంకుమలను దంచి పెళ్లి పనులకు శ్రీకారం, వసంతోత్సవం జరపనున్నారు. ఇదే రోజున స్వర్ణ లక్ష్మీ అమ్మవారికి స్నపన తిరుమంజనం గావించనున్నారు. 17న సుదర్శన హోమం, 25న సర్వ ఏకాదశి సందర్భంగా లక్ష కుంకుమార్చన నిర్వహించనున్నట్లు వైదిక పెద్దలు తెలిపారు.

పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు

- జిల్లాలోని 36 కేంద్రాల్లో ఇంటర్ పరీక్షలు
- ఐదు నిమిషాల వెసులుబాటుతో విద్యార్థుల్లో ఆనందం
- హాజరుకానున్న 19,228 మంది
- పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు



కొత్తగూడెంలోని సింగరేణి జూనియర్ కళాశాలలో హాల్‌టికెట్ నంబర్లు వేస్తున్న సిబ్బంది

కొత్తగూడెంఅర్బన్: ఇంటర్ పరీక్షలకు జిల్లాలో అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. బుధవారం నుంచి జరిగే ఈ పరీక్షలకు జిల్లాలో 36 కేంద్రాలు ఏర్పాటు చేశారు. ప్రథమ సంవత్సరం పరీక్షలకు 9,225 మంది, ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 10,003 మంది.. మొత్తం 19,228 విద్యార్థులు హాజరుకానున్నారు. ఉదయం 9 గంటలకు పరీక్ష ప్రారంభం కానుండగా 8.30 గంటల వరకే కేంద్రాల వద్దకు చేరుకోవాలని ఇంటర్ బోర్డు అధికారులు సూచించారు. అయితే ఈ ఏడాది పరీక్ష సమయం ముగిసిన ఐదు నిమిషాల వరకు కూడా అనుమతిస్తామని రాష్ట్రస్థాయి అధికారులు ప్రకటించడంతో విద్యార్థుల్లో హర్షం వ్యక్తమవుతోంది. కొత్తగూడెంలోని ఎస్‌ఆర్ డిగ్రీ కళాశాలలో ఈ సంవత్సరం కొత్తగా పరీక్ష కేంద్రం ఏర్పాటు చేశారు. పరీక్షల నిర్వహణకు 36 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 13 మంది అడిషనల్ చీఫ్ సూపరింటెండెంట్లు, 36 మంది డిపార్ట్‌మెంటల్ అధికారులతో పాటు మూడు సిట్టింగ్, రెండు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, కస్టోడియన్ అధికారులు ఐదుగురు, 550 మంది ఇన్విజిలేటర్లను నియమించినట్లు అధికారులు వెల్లడించారు. కేంద్రాల వద్ద విద్యార్థులకు వైద్య సహాయం అందించేందుకు 72 మంది ఏఎన్‌ఎంలను నియమించారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయనున్నారు.

కేంద్రాల్లో వసతుల కల్పన..

ఇంటర్ మీడియట్ పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు తాగునీటి వసతి కల్పించాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ మున్సిపల్, గ్రామ పంచాయతీ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో సిబ్బంది ఏర్పాట్లు చేశారు. కళాశాలల సిబ్బంది మంగళవారమే పరీక్ష కేంద్రాల్లో హాల్‌టికెట్ నంబర్లు వేశారు. విధులు కేటాయించిన సిట్టింగ్, ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు ఆయా సెంటర్లలో రిపోర్ట్ చేశారు. విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా పరీక్ష రాసే గదుల్లో ఫ్యాన్లు, సరిపడా వెలుతురు ఉండేలా లైట్లు ఏర్పాటు చేశారు. సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకునేలా ఆర్టీసీ అధికారులు బస్సులు నడిపించనున్నారు. ఇంకా వైద్యారోగ్య, పోలీస్, రెవెన్యూ తదితర శాఖల అధికారులు సేవలు అందించనున్నారు. ఆయా కేంద్రాల వద్ద ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, మందులు సిద్ధం చేశారు. జిల్లాలోని అన్ని పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. పరీక్షల సమయంలో సమీపంలోని జిరాక్స్ సెంటర్లు మూసివేసేలా చర్యలు చేపడుతున్నారు.

వసతి గృహాల్లో పరిశుభ్రత పాటించండి

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి భానుమతి



ఆశ్రమ పాఠశాలలో పరిశీలిస్తున్న భానుమతి

చంద్రుగొండ : వసతిగృహాల్లో పరిశుభ్రత పాటించాలని, విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెట్టాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి.భానుమతి అధికారులకు సూచించారు. స్థానిక కస్తూర్బా విద్యాలయం, గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల, ఎస్సీ బాలుర వసతిగృహాలను మంగళవారం ఆమె సందర్శించారు. వసతిగృహాల్లో విద్యార్థులకు అందుతున్న సదుపాయాలను పరిశీలించారు. పారిశుద్ధ్య చర్యలు చేపట్టకుంటే సహించేది లేదని, ఈ విషయంలో నిర్లక్ష్యం వహిస్తే అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆశ్రమ పాఠశాలల్లో మరుగుదొడ్లు సరిపడా లేవని బాలికలు ఫిర్యాదు చేయగా సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారం అయ్యేలా చూస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ నిరంజన్‌రావు, సీనియర్ న్యాయవాది మెండు రాజమల్లు పాల్గొన్నారు.

ట్రాన్స్‌జెండర్లు గౌరవంగా జీవించాలి

కొత్తగూడెంటౌన్: ట్రాన్స్‌జెండర్లు గౌరవప్రదంగా జీవించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి భానుమతి అన్నారు. మంగళవారం కొత్తగూడెం హనుమాన్‌బస్తీలో వారికి ఉచితంగా బియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మహిళల రక్షణకు అనేక చట్టాలు ఉన్నాయని, వివిధ పరిస్థితుల కారణంగా ట్రాన్స్‌జెండర్లుగా, సెక్స్ వర్కర్లుగా మారిన వారు ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహించాలని సూచించారు. ప్రతీ నెల బియ్యం పంపిణీ చేసేలా చూడాలని సెక్యూర్ ఎన్జీఓ ప్రాజెక్టు మేనేజర్ రాజేంద్రప్రసాద్‌ను ఆదేశించారు.

డయాగ్నస్టిక్ ఫీజులు 20 శాతం తగ్గించాలి



మాట్లాడుతున్న భాస్కర్‌నాయక్

కొత్తగూడెంఅర్బన్: జిల్లాలో నిర్వహిస్తున్న ప్రైవేట్ డయాగ్నస్టిక్ సెంటర్లలో రక్త పరీక్షలు, అల్ట్రాసౌండ్ స్కాన్, ఎక్స్‌రే ఫీజులను 20 శాతం మేర తగ్గించాలని డీఎంహెచ్ఓ భాస్కర్‌నాయక్ నిర్వాహకులకు సూచించారు. ఆయా కేంద్రాల వారితో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుత ఫీజుల్లో 20 శాతం మేర తగ్గిస్తూ ఆమోదించామని పేర్కొన్నారు. సమావేశంలో ఐఎంఏ అధ్యక్షుడు సీహెచ్ కృష్ణప్రసాద్, సెక్రటరీ ముక్కంటేశ్వరరావు, డాక్టర్ ప్రవీణ్, ప్రభుత్వ వైద్య కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ తిరుపతి, డాక్టర్ రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

మహిళా ఉద్యోగులకు క్రీడాపోటీలు



పోటీల్లో పాల్గొన్న మహిళా ఉద్యోగులు

సింగరేణి(కొత్తగూడెం): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని కొత్తగూడెం సింగరేణి ప్రధాన కార్యాలయంలో విధులు నిర్వర్తించే మహిళా ఉద్యోగులకు మంగళవారం ఆటల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను జీఎం పర్సనల్ (ఐఆర్‌పీఎం) కవితానాయుడు ప్రారంభించి మాట్లాడుతూ మహిళలు అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. వివిధ అంశాల్లో పోటీలు నిర్వహించగా విజేతలకు ఈనెల 8న బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజర్లు పి.కిరణ్మయి, బి.సుమలత, డి.శారద, కె.రమ, ఎ.విజయకుమారి, జీ.బీ.అరుణకుమారి, కె.శైలజ, ఎస్.గౌతమి, బి.మౌనిక తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన సేవలకే ‘పొలం బాట’

విద్యుత్ ఎస్ఈ మహేందర్

సూపర్‌బజార్(కొత్తగూడెం): రైతులకు మెరుగైన, ఉత్తమ సేవలు అందించేందుకే పొలం బాట కార్యక్రమంతో తమ శాఖ అధికారులు నేరుగా వ్యవసాయ క్షేత్రాలను సందర్శిస్తున్నారని విద్యుత్ ఎస్ఈ జి.మహేందర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సర్కిల్ పరిధిలో ఇప్పటి వరకు 137 పొలంబాట కార్యక్రమాలు నిర్వహించామని, ఒరిగిన స్తంభాలు 1,396, 1,047 లూజ్‌లైన్లు, 874 మధ్య స్తంభాలు ఏర్పాటు చేశామని తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతులకు గురి కాకుండా ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు. మోటార్లకు కెపాసిటర్లు పెట్టుకునేలా రైతులకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. కెపాసిటర్లు అమర్చడం ద్వారా మోటార్లు మరింతకాలం మన్నికగా ఉంటాయని తెలిపారు. లో ఓల్టేజీ సమస్య కూడా ఉండదన్నారు. ఆటోస్టార్టర్లు కూడా తొలగించాలని విజ్ఞప్తి చేశారు. విద్యుత్ ప్రమాదాలు లేకుండా చూడడమే లక్ష్యంగా సర్కిల్ పరిధిలో డీఈ, టెక్నికల్ అధికారులను సేఫ్టీ అధికారులుగా నియమించామని తెలిపారు. విద్యుత్ ప్రమాదాల నివారణపై విస్తృత ప్రచారం చేసి రైతులను చైతన్యం చేస్తున్నామని వివరించారు. రైతులు, వినియోగదారులు సొంతంగా విద్యుత్ పనులు చేయకూడదని కోరారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా 1912 టోల్‌ఫ్రీ నంబరుకు ఫోన్ చేయాలని సూచించారు.

ఎస్‌హెచ్‌జీ సభ్యులకు పెట్రోల్ బంక్‌లు..

- బ్యాంక్ రుణాలతో ఏర్పాటుకు అవకాశం
- కలెక్టర్ జితేష్ వి పాటిల్ వెల్లడి



మణుగూరుటౌన్ : పడవలో ప్రయాణిస్తున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

సూపర్‌బజార్(కొత్తగూడెం): స్వయం సహాయక బృందాల సభ్యులు పెట్రోల్ బంక్‌లు నిర్వహించేలా వారికి బ్యాంకుల నుంచి రుణ సదుపాయం కల్పించాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన కలెక్టరేట్ నుంచి పలు శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలన్నారు. పెట్రోల్ బంకుల స్థాపనకు రహదారుల వెంట 10 కుంటల స్థలాన్ని గుర్తించాలని అధికారులను ఆదేశించారు. సదరం సేవలను సులభతరం చేస్తూ ఇటీవల కొత్తగా యూడీఐడీ పోర్టల్ ప్రవేశపెట్టినందున దివ్యాంగులకు దీనిపై అవగాహన కల్పించాలని చెప్పారు. వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. శిథిలావస్థలో ఉన్న పాఠశాల భవనాలను గుర్తించి కూల్చివేయాలని, వేసవి సెలవుల్లో నూతన భవనాలను నిర్మిస్తామని అన్నారు. పెండింగ్ ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు డి.వేణుగోపాల్, విద్యాచందన, డీఎంహెచ్ఓ భాస్కర్‌నాయక్, ఆర్ఎంఓ రమేష్, మిషన్ భగీరథ ఈఈలు నళిని, తిరుమలేష్, భద్రాచలం డీఎల్‌పీఓ సుధీర్, సహాయ కార్మిక శాఖాధికారి ఫక్రుద్దీన్ పాల్గొన్నారు.

పరీక్షలు ప్రశాంతంగా రాయాలి

ఇంటర్ విద్యార్థులు ప్రశాంతంగా పరీక్షలు రాయాలని కలెక్టర్ మంగళవారం ఒక ప్రకటనలో సూచించారు. పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు. విద్యార్థులు ఎలాంటి ఒత్తిళ్లకు గురికాకుండా ఆత్మవిశ్వాసంతో ఉండాలని, తద్వారా ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు.

ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కానివ్వొద్దు..

భద్రాచలంఅర్బన్: భద్రాచలంలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురికాకుండా రెవెన్యూ యంత్రాంగం చర్యలు తీసుకోవాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆదేశించారు. మంగళవారం ఆయన స్థానిక అయ్యప్పస్వామి ఆలయం పక్కన గల ఖాళీ స్థలాన్ని పరిశీలించారు. ప్రభుత్వ రికార్డుల్లో నమోదైన భూమి ఎంత, వాస్తవంగా అక్కడ ఉన్నది ఎంత అనే వివరాలు సేకరించాలని ఆర్డీఓకు సూచించారు. రానున్న రోజుల్లో ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు నిర్మించాల్సి ఉన్నందున ప్రభుత్వ భూముల వివరాలు నమోదు చేయాలన్నారు.

‘పది’ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

కొత్తగూడెంఅర్బన్: ఈనెల 21న ప్రారంభమయ్యే పదో తరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ తెలిపారు. ఐడీఓసీలో డిపార్ట్‌మెంటల్ అధికారులకు మంగళవారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతూ.. జిల్లాలో 73 కేంద్రాల్లో 12,282 మంది రెగ్యులర్, 686 మంది ప్రైవేట్ విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని తెలిపారు. పరీక్షల నిర్వహణలో ఎవరూ అలసత్వం వహించొద్దని సూచించారు. సెల్‌ఫోన్‌లు, ఎలక్ట్రానిక్ పరికరాలకు కేంద్రాల్లోకి అనుమతించవద్దని చెప్పారు. కార్యక్రమంలో డీఈఓ వెంకటేశ్వరాచారి, ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

రైల్వే ట్రాక్ నిర్వాసితులతో సమావేశం

మణుగూరు టౌన్: బీటీపీఎస్ రైల్వే ట్రాక్ నిర్వాసితులతో కలెక్టర్ జితేష్ వి పాటిల్ మణుగూరులో మంగళవారం సమావేశమయ్యారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కాగా తమకు ఆర్‌అండ్ఆర్ ప్యాకేజీ లేదా ఉద్యోగం లేదంటే కంపెనీ లాభాల్లో వాటా ఇవ్వాలని కోరారు. అయితే ఎక్కువ మొత్తంలో భూమి సేకరిస్తేనే ఆర్‌అండ్ఆర్ ప్యాకేజీ వర్తిస్తుందని స్పష్టం చేశారు. అనంతరం 100 పడకల ఆస్పత్రిని సందర్శించారు. అక్కడ అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. అనంతరం సూపరింటెండెంట్ సునీల్ మజ్జేకర్ ఆస్పత్రిలోని సమస్యలను కలెక్టర్ దృష్టికి తేగా..నివేదిక అందిస్తే ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సహకారంతో ఇటీవల మెగా కంటి వైద్యశిబిరం నిర్వహించి 1,075 మందికి కంటి ఆపరేషన్లు చేయించిన నేత్ర వైద్య సహాయకులు గంజికుంట్ల సంజీవరావును అభినందించారు. కార్యక్రమంలో వైద్యులు గౌరీశంకర్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ పడవ ప్రయాణం..!

మణుగూరు టౌన్ : కలెక్టర్ జితేష్ వి పాటిల్ మంగళవారం పడవ ప్రయాణం చేశారు. మణుగూరు మండలం మల్లేపల్లి వద్ద పడవ ఎక్కిన కలెక్టర్.. మధ్యలో కొంతదూరం ఇసుకలో కాలినడకన, మరి కొంతదూరం బైక్‌పై, ఆ తర్వాత మళ్లీ పడవలో చర్ల మండలం పెద్దిపల్లి వరకు వెళ్లారు. వీరాపురం, మొగ్గళ్లపల్లి, చింతకుంట గ్రామాల్లో ఏర్పాటుచేసిన ఇసుక రీచ్‌లను పరిశీలించారు. ఇసుక ద్వారా ఎంత ఆదాయం వస్తోందని టీఎస్ఎండీసీ, రెవెన్యూ, మైనింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనుమతి లేకుండా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కలెక్టర్ వెంట చర్ల తహసీల్దార్ శ్రీనివాస్, మైనింగ్ శాఖ అధికారి దినేష్ తదితరులు ఉన్నారు.

సీతారామ కాల్వల్లో ‘గోదావరి’ పరవళ్లు

సోమ, మంగళవారాల్లో 16 గంటల పాటు ఎత్తిపోత



అశ్వాపురం మండలం బీజీ కొత్తూరు పంప్‌హౌస్ ద్వారా దిగువకు ఎత్తిపోస్తున్న జలాలు

అశ్వాపురం/ములకలపల్లి : సీతారామ ప్రాజెక్ట్ ప్రధాన కాలువల్లో గోదావరి జలాలు పరవళ్లు తొక్కుతూ ముందుకు సాగుతున్నాయి. రెండు పంప్‌హౌస్‌ల్లోనూ రెండో రోజు కూడా మోటార్లు ఆన్ చేయడంతో భారీగా దిగువకు తరలుతున్నాయి. అశ్వాపురం మండలం బీజీ కొత్తూరులోని పంప్‌హౌస్ -1 నుంచి ములకలపల్లి మండలం వీకే రామవరం శివారులోని పంప్‌హౌస్-2కు చేరుకున్నాయి. దీంతో ఇక్కడ మంగళవారం డిశ్చార్జ్ పాయింట్ వద్ద నీటిని ఎత్తిపోశారు. దీంతో 35 మిలియన్ క్యూబిక్ ఫీట్‌ల(ఎంసీఎఫ్‌టీ) నీళ్లు కమలాపురం పంప్‌హౌస్-3కి వదిలినట్లు ఐబీ డీఈ మోతీలాల్ తెలిపారు. మంగళవారం ఒక్కరోజే ఐదున్నర గంటలపాటు మోటార్లు నడిపించి, 30 ఎంపీఎఫ్‌టీల నీటికి దిగువకు మళ్లించినట్లు నీటిపారుదల శాఖ అధికారులు తెలిపారు. కాగా, అశ్వాపురం మండలం కుమ్మరిగూడెంలోని దుమ్ముగూడెం ఆనకట్ట నుంచి బీజీ కొత్తూరులోని సీతారామ ప్రాజెక్ట్ ఫేస్-1 పంప్‌హౌస్ ద్వారా సోమవారం ఎనిమిది గంటలు, మంగళవారం ఎనిమిది గంటల పాటు గోదావరి జలాలు దిగువకు ఎత్తిపోశారు. గంటకు 5.4 ఎంసీఎఫ్‌టీ చొప్పున 86.4 ఎంసీఎఫ్‌టీ నీరు దిగువకు ఎత్తిపోశారు. బీజీకొత్తూరు, పూసుగూడెం, కమలాపురం పంప్‌హౌస్‌ల ద్వారా 100.22 కిలోమీటర్ల వద్ద ఏన్కూరు లింక్ కెనాల్ మీదుగా 8.60 కిలోమీటర్లు ప్రవహించి నాగార్జునసాగర్ కెనాల్‌కు తరలించనున్నారు.

రైతుల్లో ఆనందం..

చంద్రుగొండ : రైతులు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న కల మంగళవారం సాకారమైంది. ట్రయల్ రన్‌లో భాగంగా అధికారులు సీతారామ ప్రాజెక్ట్ కాలువలోకి నీరు వదలగా అన్నపురెడ్డిపల్లి, చంద్రుగొండ మండలాలకు గోదావరి జలాలు రావడంతో రైతులు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. రాజాపురంలో ఆదర్శరైతు భీమిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో గోదావరి జలాలకు పూజలు చేశారు.

నేడు రాజీవ్ లింక్ కెనాల్ ట్రయల్ రన్..

జూలూరుపాడు: సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ మెయిన్ కెనాల్ నుంచి ఏన్కూరు ఎన్నెస్పీ కెనాల్‌ను అనుసంధానం చేసే రాజీవ్ లింక్ కెనాల్ వద్ద బుధవారం ట్రయల్ రన్‌కు ఇరిగేషన్ అధికారులు ఏర్పాట్లు చేశారు. అశ్వాపురం మండలం అమ్మగారిపల్లి వద్ద ఉన్న దుమ్ముగూడెం ప్రాజెక్ట్ నుంచి వంద కిలోమీటర్ల దూరాన వినోభానగర్‌లోని మెయిన్ కెనాల్ ద్వారా ఏన్కూరు ఎన్నెస్పీ కెనాల్‌కు నీటి సరఫరాకు ఈ కాల్వను నిర్మించారు. కాగా, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ సీతారామ ప్రాజెక్ట్ కెనాల్ వద్ద గోదావరి జలాలకు పూజలు నిర్వహించనున్నారు.

బియ్యం దందాను ఆపేదెవరు?



బియ్యం లారీను తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు (ఫైల్)

విడతల వారీగా విజిలెన్స్ దాడులు

- సాధారణ తనిఖీలు లేక అక్రమార్కుల ఇష్టారాజ్యం
- చెక్‌పోస్ట్ ఏర్పాటు చేస్తేనే ఫలితం

అశ్వారావుపేట: రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి అశ్వారావుపేట మీదుగా ఆంధ్రాకు బియ్యం తరలించే వారి దందా అప్పుడప్పుడే వెలుగులోకి వస్తోంది. రేషన్, లెవీ, సీఎంఆర్ బియ్యం ఇలా ప్రభుత్వ ఆధీనంలో ఉండే పలు రకాల బియ్యం అశ్వారావుపేట మీదుగా అక్రమంగా రవాణా చేస్తుండగా, విజిలెన్స్ అధికారులు ఎవరైనా ఫిర్యాదు చేస్తేనో.. వారికి తీరిక ఉన్నప్పుడు మాత్రమే తనిఖీలు చేపడుతున్నారు. ఈ సమయాన లారీలు పట్టుబడుతుండగా మిగతా సమయాల్లో స్థానిక సివిల్ సప్లయీస్ అధికారుల తనిఖీలు లేక అక్రమార్కులు యథేచ్ఛగా బియ్యాన్ని సరిహద్దులు దాటిస్తున్నారు. గతంలో మహబూబాబాద్ ప్రాంతానికి చెందిన మిల్లర్ల మధ్య ఐక్యత లోపించి ఒకరికి చెందిన బియ్యం లారీలను అశ్వారావుపేట పోలీసులు, విజిలెన్స్ అధికారులకు పట్టించారు. ఆ తర్వాత మరోమారు ఇలాగే జరిగింది. రాష్ట్రంలో ఎక్కడి నుంచైనా సరే అక్రమ మార్గాల్లో సేకరించిన బియ్యాన్ని అశ్వారావుపేట మీదుగానే సరిహద్దు దాటించాల్సి ఉంటుంది. కానీ విజిలెన్స్ అధికారులు మాత్రమే దాడులు చేస్తుండగా, సివిల్ సప్లయీస్ అధికారులు సరిహద్దులో చెక్‌పోస్టు ఎందుకు ఏర్పాటు చేయడం లేదనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

అప్పుడప్పుడే తనిఖీలు

గడిచిన పదిహేనేళ్లలో ప్రభుత్వం మారి కొత్త ప్రభుత్వం కొలువుదీరినప్పుడు ఈ తరహా తనిఖీలు జరుగుతున్నాయి. అక్రమంగా రవాణా అవుతున్న బియ్యం లారీలను అడ్డుకునే క్రమాన మొదటి మూడు, నాలుగు లారీలకు సరైన పత్రాలు లేవని చెప్పడం.. మిగతా లారీలను వదిలేయడం షరామామూలుగా మారింది. లారీల యజమానులు చెప్పిన మాట వినడం తప్ప స్థానిక అధికారులు, పోలీసులు ఎటూ తేల్చుకోలేని పరిస్థితులు ఎదురవుతున్నాయని తెలుస్తోంది. లారీల యజమానులు, మిల్లర్లు, అధికారులు ఇలా మూడు నెట్‌వర్క్‌ల మధ్య అంతా సవ్యంగా ఉంటే సరి.. ఎక్కడైనా తేడా వచ్చినప్పుడు అశ్వారావుపేట దాటకముందే లారీలు పట్టుబడుతున్నాయని చెబుతున్నారు. అయితే, లారీలను సీజ్ చేసిన సమయాన తప్ప మిగతా సమయంలో అక్రమ రవాణా జరగడం లేదా అంటే ఎవరూ సమాధానం చెప్పలేకపోతున్నారు. అయితే, అశ్వారావుపేటలో మాత్రమే బియ్యం లారీలను సీజ్ చేస్తుండగా వందల కి.మీ. దాటి వచ్చే క్రమాన ఎందుకు తనిఖీలు చేయడం లేదో అధికారులే చెప్పాలి ఉంటుంది. గత శుక్రవారం అశ్వారావుపేటలో విజిలెన్స్ అధికారులు 12 లారీలను ఆపి పోలీసులకు అప్పగించారు. ఈ తర్వాత పత్రాలన్నీ సరిగ్గా ఉన్నాయని తొమ్మిది లారీలను పంపించి, కేవలం మూడు లారీలనే సీజ్ చేయడం గమనార్హం.

సూత్రధారులు ఎవరు?

తెలంగాణ నుంచి కాకినాడ షిప్‌యార్డుకు అక్రమంగా చేర్చిన బియ్యాన్ని అక్కడి డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ గుర్తించి 'సీజ్ ద షిప్' అని చెప్పడం.. ఆతర్వాత పరిణామాలూ అందరికీ తెలిసిందే. అలాగే, అశ్వారావుపేటలో ఆ స్థాయిలో హంగామా లేకున్నా విడతల వారీగా లారీల సీజ్ జరుగుతోంది. కొన్నాళ్లకు అంతా సవ్యంగానే సాగుతోందని చెబుతున్నారు. అయితే, దందాకు సూత్రధారులెవరు, అక్రమ రవాణాకు సులభ దారులు ఏమిటనే అంశాలను గత కేసులను ఆధారంగా పోలీసులు, ప్రభుత్వం ఎందుకు విచారణ చేయడం లేదనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయమై సివిల్ సప్లయీస్ డీటీ గుర్రం ప్రభాకర్‌ను వివరణ కోరగా లారీలను తనిఖీ చేసే అధికారం తమకు ఉందని తెలిపారు. కానీ శాశ్వత చెక్‌పోస్టు ఏర్పాటు అంశంలో ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని వెల్లడించారు.

క్లుప్తంగా

లక్ష్యాన్ని సాధించేవరకు విశ్రమించొద్దు..



గుండాల: విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డీడీ మణెమ్మ

గుండాల/పాల్వంచరూరల్: విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకుని, దానిని సాధించే వరకు విశ్రమించొద్దని ఐటీడీఏ డీడీ మణెమ్మ సూచించారు. మంగళవారం ఆళ్లపల్లి మండలం అనంతోగు, పాల్వంచ మండలం ఉల్వనూరు గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలల్లో కెరీర్ గైడెన్స్‌పై సమీక్ష నిర్వహించారు. పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించాలని, అనంతరం చదువు మధ్యలో ఆపకుండా పైచదువులకు వెళ్లాలని సూచించారు. ఇంటర్, పాలిటెక్నిక్, ఐటీఐ ఇలా.. భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని కోర్సులను ఎంచుకోవాలని సూచించారు. వేసవి సెలవలను వృథా చేయకుండా నైపుణ్యం ఉన్న రంగాల్లో శిక్షణ తీసుకోవాలని చెప్పారు. పోలీస్, ఫారెస్ట్, వైద్య, విద్యుత్ శాఖ అధికారులు విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఇల్లెందు ఏటీడీఓ రాధమ్మ, హెచ్‌ఎం భద్రమ్మ, ప్రత్యేకాధికారి మధుకర్, పాల్వంచ తహసీల్దార్ వివేక్, ఎంపీడీఓ విజయ్‌భాస్కర్‌రెడ్డి, ఎంఈఓ శ్రీరాంమూర్తి, ఏఓ శంకర్, డాక్టర్ తేజశ్రీ, డీఈ సుధా, ఎస్‌ఐ సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

భద్రాచలం గోదావరి వద్ద గజ ఈతగాళ్ల ఏర్పాటు



గోదావరి వద్ద గజ ఈతగాళ్లు

భద్రాచలంఅర్బన్: భద్రాచలంలోని గోదావరిలో జరుగుతున్న ప్రమాదాలను నివారించేందుకు మంగళవారం అధికారులు గజ ఈతగాళ్లను ఏర్పాటు చేశారు. ఇటీవల నీటమునిగి పలువురు భక్తులు మృతి చెందిన నేపథ్యంలో జిల్లా కలెక్టర్ జితేశ్ వి పాటిల్ ఆదేశాల మేరకు ప్రమాదాలు అరికట్టేందుకు భద్రాచలం ఆర్డీఓ దామోదర్‌రావు పంచాయతీ, రామాలయ అధికారులతో సమావేశం నిర్వహించి నలుగురు గజ ఈతగాళ్లను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు.

సౌర విద్యుత్ ప్లాంట్లకు దరఖాస్తు గడువు పెంపు

ఖమ్మంవ్యవసాయం: రైతులు తమ భూముల్లో సౌర విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు దరఖాస్తు చేసుకునే గడువును ఈనెల 10వ తేదీ వరకు పొడిగించారు. పీఎం కుసుమ్ పథకం కింద వ్యవసాయ యోగ్యం కాని బీడు, బంజర భూముల్లో ప్లాంట్ల ఏర్పాటుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. రైతులతో పాటు, వ్యవసాయ ఉత్పత్తి సంఘాలు, సహకార సంఘాలు, స్వయం సహాయక సంఘాలు, వివిధ సంస్థలకు సైతం అవకాశం కల్పించారు. అయితే, దరఖాస్తు గడువు 2వ తేదీతో ముగియగా ఉమ్మడి జిల్లాలో 75 మంది ముందుకొచ్చారు. ఈనేపథ్యాన గడువు పెంచగా, ఆసక్తి ఉన్న రైతులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని రెడ్‌కో ఉమ్మడి జిల్లా మేనేజర్ పి.అజయ్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు.

'వనజీవి'ని కలిసిన బీట్ ఆఫీసర్లు

ఖమ్మంరూరల్: మండలంలోని రెడ్డిపల్లికి చెందిన పద్మశ్రీ అవార్డు గ్రహీత వనజీవి రామయ్యను రాష్ట్ర ఫారెస్ట్ అకాడమీ 35వ బ్యాచ్‌కు చెందిన 40మంది ఫారెస్ట్ ట్రైనింగ్ బీట్ ఆఫీసర్లు మంగళవారం కలిశారు. ఈసందర్భంగా విత్తనాల సేకరణ, మొక్కలు నాటడం, పరిరక్షణపై తన అనుభవాలను రామయ్య వివరించారు. మొక్కలు నాటడమే కాక అడవులను నరికివేయకుండా అడ్డుకోవడాన్ని అందరూ బాధ్యతగా భావించేలా అవగాహన కల్పించాలని సూచించారు. అటవీ అకాడమీ కోర్సు డైరెక్టర్ గంగారెడ్డి, కూసుమంచి రేంజ్ ఆఫీసర్ పి.శ్రీనివాసరావు, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ కే.వీ.రామారావుతో పాటు ఉద్యోగులు కొండల్‌రావు, పి.డానియేల్, వెంకటేశ్వర్లు, నర్సింహారావు, మధు తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో ఉపాధ్యాయురాలు మృతి



హసవత్ కిరణ్మయి (ఫైల్)

దమ్మపేట: మండలంలోని నాగుపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న హసవత్ కిరణ్మయి (36) మంగళవారం రాత్రి కొత్తగూడెం ఆస్పత్రిలో గుండెపోటుతో మృతిచెందింది. కిరణ్మయి కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ వైద్యం నిమిత్తం ప్రస్తుతం సెలవులో ఉన్నారు. ఆమె మంగళవారం కొత్తగూడెంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లగా అక్కడే అకస్మాత్తుగా గుండెపోటు వచ్చి మృతి చెందారు. ఎంఈఓ కీసర లక్ష్మి, స్థానిక ఉపాధ్యాయులు సంతాపం వ్యక్తం చేశారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.20,487

బొగ్గు పుట్టినింటికి ఆపద రావొద్దు..



జేకేఓసీలో బొగ్గు నిల్వలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య, అధికారులు

ఇల్లెందు: 130 ఏళ్ల కిందట ఇల్లెందులో బొగ్గు పుట్టిందని, అలాంటి బొగ్గు పుట్టినింటికి ఆపద రావొద్దని ఎమ్మెల్యే కోరం కనకయ్య సింగరేణి అధికారులకు సూచించారు. ఈ నెలాఖరుతో జేకే-5 ఓసీ మూతపడే ప్రమాదం ఉందని, నూతన పూసపల్లి ఓసీ అనుమతులు జాప్యం అవుతున్నాయని, కార్మికులు, ఉద్యోగుల బదిలీలు తప్పవని ఆందోళన చెందుతున్న తరుణంలో జేకేఓసీని సింగరేణి అధికారులతో కలిసి ఎమ్మెల్యే మంగళవారం సందర్శించారు. అక్కడి బొగ్గు నిల్వలు పరిశీలించారు. ఓసీలో ఉన్న ఓవర్‌మెన్స్, సర్వే అధికారులతో మైన్ పరిస్థితితులను అడిగి తెలుసుకున్నారు. పూసపల్లి ఓసీ అనుమతులు వచ్చే వరకు ఇక్కడి అధికారులు, కార్మికులను బదిలీ చేయకుండా ఓసీని కొనసాగించాలని జీఎం కృష్ణయ్యను కోరారు. జీఎం కృష్ణయ్య మాట్లాడుతూ.. పూసపల్లి ఓసీ ఈఏస్‌సీ సమావేశం ఈ నెల 18న ఉందని, తుది అనుమతులు లభించినా ఏప్రిల్, మే నెలలో ఓసీ ప్రారంభమవుతుందని తెలిపారు. ఎమ్మెల్యే వెంట ఐఎన్‌టీయూసీ నేతలు జనక్‌ప్రసాద్ గుర్తింపు సంఘం ఉపాధ్యక్షుడు జె.వెంకటేశ్వర్లు, ఇల్లెందు ఏరియా జీఎం వీసం కృష్ణయ్య, అధికారులు మోహన్‌రావు, కృష్ణమోహన్, పూర్ణచందర్, గోచికొండ సత్యనారాయణ, మహబూబ్, బండారి నాగేశ్వరరావు, పడిదల నవీన్, బొల్లెద్దుల ప్రభాకర్, కుడితి శ్రీనివాస్, బాబూరావు, కాంగ్రెస్ పట్టణ నాయకులు మడుగు సాంబమూర్తి, బోళ్ల సూర్యం, దొడ్డా డానియేల్, సుదర్శన్ కోరీ తదితరులు ఉన్నారు.

నేటి నుంచి పగిడిద్దరాజు జాతర



జాతరకు సిద్ధమైన సమ్మక్క - పగిడిద్దరాజు గద్దెలు

గుండాల: మేడారం సమ్మక్క భర్త, అరెం వంశీయుల ఇలవేల్పు పగిడిద్దరాజు జాతర మండలంలోని యాపలగడ్డ గ్రామంలో బుధవారం ప్రారంభం కానుంది. మేడారం జాతర అనంతరం ఇక్కడ సమ్మక్క - పగిడిద్దరాజుల నాగవెల్లి జాతర నిర్వహించడం ఆనవాయితీ. నేటి నుంచి మూడు రోజుల పాటు జరిగే జాతరకు గ్రామ సమీపంలోని గద్దెల వద్ద అన్ని ఏర్పాట్లు చేశారు. తొలిరోజు పగిడిద్దరాజును వనం(గుట్ట) నుంచి గుడికి తీసుకొచ్చి, రాత్రి ఎదురిల్లుట చేస్తారు. గురువారం వనదేవతను గుట్ట నుంచి తీసుకొస్తారు. దీంతో జాతర ప్రారంభమవుతుంది. పలు కార్యక్రమాల అనంతరం శనివారం ఉదయం దేవతలను గుట్టకు సాగనంపడంతో జాతర ముగుస్తుంది. మూడు రోజుల పాటు జరిగే ఈ జాతరకు భద్రాద్రి, ఖమ్మం, వరంగల్, ములుగు జిల్లాల నుంచే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరవుతారు. కాగా, పగిడిద్ద రాజు జాతరకు పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్కతో పాటు పినపాక, భద్రాచలం, ఇల్లెందు, అశ్వారావుపేట ఎమ్మెల్యేలు పాయం వెంకటేశ్వర్లు, తెల్లం వెంకట్రావు, కోరం కనకయ్య, జారె ఆదినారాయణను ప్రత్యేకంగా ఆహ్వానించారు.

అందుబాటులోకి డీసీసీబీ క్యూఆర్ కోడ్ సేవలు



క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న చైర్మన్,అధికారులు

ఖమ్మంవ్యవసాయం: ఖాతాదారులు, వినియోగదారుల సౌకర్యార్థం జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) క్యూఆర్(క్విక్ రెస్పాన్స్) కోడ్ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ మేరకు సేవలను మంగళవారం ఖమ్మంలోని ప్రధాన కార్యాలయంలో చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు ప్రారంభించి మాట్లాడారు. బ్యాంకు ప్రణాళిక, అభివృద్ధి విభాగాన్ని ప్రత్యేకంగా ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ విభాగం ద్వారా సదుపాయాల కల్పన, అవసరమైన సేవలను ప్రవేశపెడతామని.. ఇందులో భాగంగానే క్యూఆర్ కోడ్‌ను అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. నగదు రహిత విధానాన్ని ప్రోత్సహించేలా అమలుచేస్తున్న ఈ విధానాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పాలకవర్గ సభ్యులు, సీఈఓ ఎస్.వెంకటఆదిత్య, అధికారులు పాల్గొన్నారు.

లైంగిక వేధింపులకు పాల్పడుతున్న వ్యక్తిపై కేసు

పాల్వంచరూరల్: లైంగిక వేధింపులకు పాల్పడుతున్న వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని పాతసూరారం గ్రామానికి చెందిన భూక్యా అశోక్ లైంగిక వేధింపులకు గురిచేస్తున్నాడని, గత నెలలో ఇంటి గోడదూకి వచ్చాడని భూక్యా అరుణ మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు అశోక్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సురేశ్ తెలిపారు.

లారీడ్రైవర్‌పై..

మండలంలోని పెద్దమ్మగుడి వద్ద బీసీయం జాతీయ రహదారిపై పాల్వంచవైపు వస్తున్న కారును ఈ నెల 2వ తేదీన వెనుక నుంచి వచ్చిన ఇసుక లారీ ఢీకొట్టింది. కారు వెనుక భాగం దెబ్బతిన్నదని కారుడ్రైవర్ హన్మంతరావు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు లారీడ్రైవర్ గుగులోత్ రమేశ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సురేశ్ తెలిపారు.

అక్రమ భవన నిర్మాణదారులకు నోటీసులు

చర్ల: మండలంలోని దానవాయిపేటలోని ఫారెస్టు భూమిలో అక్రమంగా నిర్మిస్తున్న భవన నిర్మాణానికి సంబంధించి మంగళవారం నోటీసులు జారీ చేశారు. ఫారెస్ట్ రేంజ్ అధికారి ద్వాలియా కథనం ప్రకారం.. దానవాయిపేట శివారులోని ఫారెస్టు భూమిలో కొంత కాలంగా ఒక నిర్మాణం కొనసాగుతోంది. ఈ విషయమై గతంలో పనులు నిలిపివేయాలని హెచ్చిరించినప్పటికీ వారు పట్టించుకోకుండా పనులు కొనసాగిస్తుండటంతో ఉన్నతాధికారులతో పాటు పోలీసులకు ఫిర్యాదు చేసి నిర్మాణం చేస్తున్న వారికి నోటీసులు జారీ చేసినట్లు రేంజ్ అధికారి తెలిపారు.

ఇరవెండి ఎఫ్‌బీఓపై సస్పెన్షన్ వేటు

బూర్గంపాడు: విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన కారణంతో బూర్గంపాడు మండలంలోని ఇరవెండి ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ లక్‌పతిని అటవీశాఖ ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. ఇరవెండి ఫారెస్ట్ బీట్‌లో అటవీ భూమి అన్యాక్రాంతమైందనే ఆరోపణలతో ఆయనపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టారు. ఇటీవల జిల్లా అటవీశాఖ అధికారి కృష్ణగౌడ్ ఇరవెండి ఫారెస్ట్ బీట్‌ను పరిశీలించారు. పోడు నరికినప్రాంతాన్ని సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. విధు ల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన కారణంతో బీట్ ఆఫీసర్‌ను సస్పెండ్ చేశారు.

20 కేజీల గంజాయి పట్టివేత



గంజాయితో నిందితుడు

భద్రాచలంఅర్బన్: గంజాయి తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను మంగళవారం పోలీసులు పట్టుకున్నారు. రెండు ద్విచక్రవాహనాలపై ముగ్గురు వ్యక్తులు 20 కేజీల గంజాయి తరలిస్తూ.. పట్టణంలోని కూనవరం రోడ్డులోని ఆర్టీఏ చెక్‌పోస్టు వద్ద టౌన్ పోలీసులకు చిక్కారు. పట్టుబడిన వ్యక్తులు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లా కుంట పట్టణానికి చెందిన వారిగా తేలిందని, గంజాయిని మల్కన్‌గిరిలో కొనుగోలు చేసి హైదరాబాద్‌లో విక్రయించేందుకు తరలిస్తూ పట్టుబడ్డారని, గంజాయి విలువ రూ.10.30 లక్షలు ఉంటుందని ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు.

గంజాయి పట్టివేత

చంద్రుగొండ: ఓ వ్యక్తి గంజాయిని అక్రమంగా తరలిస్తూ మండల కేంద్రంలో నిర్వహిస్తున్న వాహనాల తనిఖీలో మంగళవారం పట్టుబడ్డాడు. ఎస్‌ఐ శివరామకృష్ణ కథనం ప్రకారం.. క్లూస్ టీంతో కలిసి పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టగా చంద్రుగొండకు చెందిన డి.వెంకటేశ్వరరావు బైక్‌పై వెళ్తుండగా ఆపారు. తనిఖీ చేయగా 500 గ్రాముల గంజాయి లభించడంతో గంజాయితోపాటు బైక్, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేశామని ఎస్‌ఐ చెప్పారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలో సీతారామచంద్రస్వామి దేవస్థానానికి చెందిన తానీషా కల్యాణ మండంలోని డార్మిటరీలో ఉన్న బాత్రూమ్‌లో మంగళవారం ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. టౌన్ ఎస్‌ఐ రామకృష్ణ కథనం ప్రకారం.. కల్యాణ మండపం సిబ్బంది సమాచారంతో సుమారు 45 ఏళ్ల వయసు ఉన్న ఓ వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. చామనఛాయ రంగు, నలుపు రంగు నిక్కరు ధరించి ఉన్నాడు. అతని వద్ద ఓ లగేజీ బ్యాగ్ కూడా ఉంది. మృతదేహాన్ని భద్రాచలం ప్రభుత్వాస్పత్రి మార్చురీలో భద్రపరిచారు. ఎవరైనా గుర్తిస్తే భద్రాచలం స్థానిక పోలీస్ స్టేషన్‌లో 87126 86107 నంబర్లో సంప్రదించాలని ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు.

మహిళా సమాఖ్యల ద్వారా ఆర్టీసీకి బస్సులు

మొదటి దశలోనే ఉమ్మడి జిల్లాకు స్థానం

ఖమ్మంమయూరిసెంటర్: మహిళలు ఆర్థికంగా అభివృద్ధి సాధించేలా రాష్ట్రప్రభుత్వం వివిధ పథకాల్లో స్థానం కల్పిస్తోంది. ఇప్పటికే ఇందిరా మహిళ శక్తి పేరుతో క్యాంటీన్లు మంజూరు చేస్తుండగా, తాజాగా ఆర్టీసీ అద్దెకు తీసుకునే బస్సులను మహిళా సంఘాల నుంచే సమకూర్చుకోవాలని నిర్ణయించింది. రాష్ట్రంలో మొత్తం 600 బస్సులను ఈ విధానంలో సేకరించాలనేది లక్ష్యం కాగా, మొదటి దశలో 150 బస్సులను మహిళా సమాఖ్యలకు రుణాల మంజూరు ద్వారా కొనుగోలు చేయిస్తారు. ఈక్రమాన రుణాలు మంజూరు చేసే బ్యాంకులకు ప్రభుత్వమే పూచీకత్తు ఇస్తుంది. కాగా, మొదటి దశలో కొనుగోలు చేసే 150బస్సుల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని మహిళా సమాఖ్యలకు సైతం స్థానం దక్కనుంది. సుమారు 30 - 35 బస్సులను ఇక్కడి మహిళా సమాఖ్యల ద్వారా కొనుగోలు చేసి ఆర్టీసీకి అప్పగిస్తారు. ఆపై ఆర్టీసీ ఒక్కో బస్సుకు రూ.77,220 చొప్పున అద్దె చెల్లిస్తుంది. ఇందులో కొంత మేర రుణవాయిదాలు చెల్లిస్తూ మిగతా నగదును సమాఖ్య సభ్యులుగా వాటాలు తీసుకుంటారు. కాగా, ఈనెల 8న మహిళా దినోత్సవం రోజునే 50బస్సులను ప్రభుత్వం ప్రారంభించనుండగా, జిల్లాలో మహిళా సమాఖ్యలను ఎంపిక చేయడంలో అధికారులు నిమగ్నమయ్యారు.

సాయిబాబా ఆలయంలో చోరీ



సీసీ కెమెరాలో రికార్డ్ అయిన నిందితుడు

పినపాక: మండల పరిధిలోని ఏడూళ్ల బయ్యారం సాయి బాబా ఆలయంలో సోమవారం అర్ధ రాత్రి దాటాక గుర్తుతెలియని వ్యక్తి చోరీకి పాల్పడ్డాడు. ఆలయ తలుపులు పగుల గొట్టి హుండీలోని నగదు ఎత్తుకెళ్లాడు. ఈ దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డయ్యాయి. ఈ మేరకు సీసీ ఫుటేజీని పరిశీలించి కేసు నమోదు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. సీసీ కెమెరాల్లో నమోదైన వ్యక్తి ఎవరికైనా తారసపడితే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు.

ఎర్రచందనం చెట్లు నరికివేత



నరికివేసిన ఎర్రచందనం చెట్లు

ఇల్లెందురూరల్: మండలంలోని కొమరారం శివారులో మంచె రమేశ్‌కు చెందిన 20 ఎర్రచందనం చెట్లను ట్రాన్స్‌కో అధికారులు మంగళవారం నరికివేశారు. కొమరారం సబ్‌స్టేషన్ నుంచి హెచ్‌టీ లైన్ కింది భాగంలో ఏపుగా పెరిగిన చెట్లను రెండు రోజులుగా ట్రాన్స్‌కో అధికారులు తొలగించే పనులు చేపట్టారు. ఈ క్రమంలో ఎర్రచందనం చెట్లు విద్యుత్ తీగలకు కింది భాగంలో ఉండటంతో రెండు వరుసలలో 20 చెట్లను పూర్తిగా నరికివేశారు. ఇదిలాఉండగా తాము మొక్కలు నాటిన తరువాతే ట్రాన్స్‌కో అధికారులు విద్యుత్ లైన్ వేశారని, గతంలో తీగల కింద భాగంలో చెట్లు నరికే క్రమంలో నష్టం జరగకుండా జాగ్రత్తలు తీసుకునేవారని, ప్రస్తుతం చెట్లను పూర్తిగా తొలగించి తమకు భారీ నష్టం చేశారని రైతు రమేశ్ వాపోయాడు. అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరాడు. ఇదే విషయమై ట్రాన్స్‌కో ఏడీఈ కోటేశ్వరరావును వివరణ కోరగా.. నిబంధనలకు లోబడి విద్యుత్ సరఫరాలో అవాంతరాలను అధిగమించేందుకు హెచ్‌టీ లైన్ కింది భాగంలో ఉన్న చెట్లను తొలగించామని చెప్పారు.

చెక్కు బౌన్స్ కేసు కొట్టివేత

భద్రాచలంఅర్బన్: సారపాకకు చెందిన చల్లపల్లి నాగేశ్వరరావు వరంగల్‌కు చెందిన కొత్త ఇందిర రూ.20 లక్షలు ఇవ్వాలని 2017లో భద్రాచలం జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో చెక్ బౌన్స్ కేసు వేశారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన భద్రాచలం ప్రథమ శ్రేణి న్యాయమూర్తి వి.శివనాయక్ మంగళవారం కేసును కొట్టి వేశారు. కొత్త ఇందిర తరఫున ముత్యాల కిశోర్, దాసరి కవిత వాదించారు.

కేసు నమోదు

పాల్వంచ: చిట్టి డబ్బులు ఇవ్వలేదని దాడి చేసిన వ్యక్తులపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. పట్టణంలోని ఇందిరాకాలనీకి చెందిన చింతలచెర్వు కోటేశ్వరరావు భార్య వాణి పండ్ల వ్యాపారం చేస్తోంది. వాసాల గోవర్ధని వద్ద వారం వారం చిట్టీ డబ్బులు కడుతోంది. ఇటీవల డబ్బులు కట్టక పోవడంతో గోవర్ధని, వాసాల శ్రీనివాస్, సరిత కలిసి వాణి ఇంటికి వెళ్లి డబ్బులు అడిగారు. ఈ క్రమంలో వారి మధ్య గొడవ జరగడంతో దాడికి పాల్పడ్డారు. వాణి ఫిర్యాదు మేరకు మంగళవారం ఎస్‌ఐ రాఘవయ్య ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం



మంటలు ఎగిసిపడుతున్న దృశ్యం

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని ఇందిరా మార్కెట్‌లో నివాసం ఉండే కొణిజర్ల సత్యనారాయణమూర్తికి చెందిన ఇంట్లో మంగళవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా నిప్పంటుకుంది. ఇంట్లో ఉన్న సామగ్రి, పొలం ధ్రువపత్రాలు, బంగారం, నగదు, స్టడీ సర్టిఫికెట్లతో పాటు ఇతర పరికరాలు పూర్తిగా దగ్ధమయ్యాయి. స్థానికుల సమాచారంతో వచ్చిన అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. రూ.3 లక్షల ఆస్తి నష్టం జరిగినట్లు ఇంటి యజమాని సత్యనారాయణ తెలిపారు.

భార్యపై భర్త కత్తితో దాడి



గాయపడిన లక్ష్మి

పాల్వంచ: కుటుంబ కలహాల నేపథ్యంలో భార్యపై భర్త కత్తితో దాడి చేయడంతో తీవ్రగాయమైంది. స్థానికుల కథనం మేరకు.. పట్టణంలోని బొల్లేరుగూడెం ఏరియా వర్తక సంఘం భవన్ దగ్గర రేగా రవీందర్, లక్ష్మీ ఏడాదిగా నివాసం ఉంటున్నారు. దంపతుల మధ్య కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో మంగళవారం మద్యం తాగేందుకు రవీందర్ లక్ష్మిని అడగగా ఆమె నిరాకరించింది. దీంతో మరోమారు గొడవ జరగగా.. రవీందర్ లక్ష్మిని కత్తితో కడుపులో పొడిచాడు. తీవ్ర రక్తస్రావం కావడంతో ఆమెను ప్రభుత్వ ఆస్పత్రికి, అనంతరం మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలించారు. కాగా రవీందర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. బాధితురాలి సోదరి లావణ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రాఘవయ్య తెలిపారు.